# వాము

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన పంట వాము. క్రొత్తగా ఏర్పడిన మార్కెట్, సాగులో సమస్యలు తక్కువగా ఉండటం వలన వాము సాగు బాగా ప్రాచుర్యంలోకి వస్తోంది. దీనిని మన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోను పండించవచ్చు.

**వాతావరణం :** చల్లని వాతావరణం, మంచు ఈ పంట పెరుగుదలకు అనుకూలం.

**నేలలు :** ఈ పంటని వర్షాధారం క్రింద సాగు చేయదలిస్తే నల్లరేగడి నేలలు అనుకూలం. నీటిపారుదల క్రింద సాగు చేయదలిస్తే తేలికపాటి నేలలు కూడా అనుకూలం. అధిక ఆమ్ల, క్షార నేలలు, నీరు నిలువ ఉండేనేలలు అనుకూలం కావు.

**విత్తే కాలం :** వర్షాధారంగా ఆగష్టు చివరి వారం నుంచి సెప్టెంబరు మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. నీటిపారుదల క్రింద సెప్టెంబరు మొదటి పక్షం నుంచి అక్టోబరు ద్వితీయ పక్షం వరకు విత్తుకోవచ్చు.

**రకాలు :** లాం సెలక్షన్-1 రకం 150-160 రోజుల్లో పంటకు వస్తుంది. ఎకరాకు షుమారు 5 క్వింటాళ్ళ దిగుబడి ఇస్తుంది.

**నేల తయారి :** మెత్తని పదును వచ్చేవరకు 2-3 సార్లు దుక్కి దున్నాలి. ఎకరాకు 4-5 టన్నుల పశువుల ఎరువు వేయాలి. పంటకు ముందు పచ్చిరొట్ట ఎరువులు పెంచి దున్నడం వలన మంచి ఫలితం ఉంటుంది.

**విత్తుట :** ఎకరాకు కిలో విత్తనం అవసరం అవుతుంది. కిలో విత్తనానికి 1 గ్రా. కార్బండైజిమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని 1:5 నిష్పత్తిలో ఇసుకతో కలిపి గొర్రుతో 3-4 సెం.మీ.ల లోతులో ఎద పెట్టాలి. సాలుకి సాలుకి మధ్య 60 సెం.మీ. ఎడం ఉండేట్లు విత్తుకోవాలి. మొలక రావడానికి రెండు వారాలు పడుతుంది. కాబట్టి అవసరాన్ని బట్టి తేలికపాటి తడి ఇచ్చి మొలక సరిగా వచ్చేట్లు చూసుకోవాలి. మొక్కలు మొలిచిన తరువాత రెండు మూడు ఆకుల దశలో చాళ్ళలో మొక్కల మధ్య 20 సెం.మీ. ఉండేట్లుగా వత్తు (థిన్నింగ్) తీసుకోవాలి.

**ఎరువులు, అంతరకృషి :** ఆఖరి దుక్కిలో ఎకరాకు 15 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నీటి వసతి ఉన్నట్లయితే విత్తిన 35-40 రోజులకు 15 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేసుకోవాలి. విత్తిన తరువాత మొదటి 100-110 రోజుల్లో 2-3 సార్లు కలుపు తీసి, గొర్రుతో అంతరకృషి చేసి గుంటక తోలాలి. నీటిపారుదల క్రింద 20-25 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి.

**సస్యరక్షణ :**

**పేనుబంక :** మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఎర్రనల్లి :** ఆకుల అడుగు భాగాన చేరి రసం పీలుస్తాయి. నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**తామర పురుగులు :** ఇవి రసం పీల్చడం వలన ఆకులు పైకి ముడుచుకొని పోతాయి. వీటి నివారణకు ఫిప్రొనిల్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**లీఫ్ మైనర్ :** ఒక రకమైన ఈగల లార్వాలు ఆకులను తొలిచి వేయడం వలన ఆకులు ఎర్రబారి ముడుచుకొని పోతాయి. వీటి నివారణకు వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**బూడిద తెగులు :** ఆకులపై తెల్లని బూడిద వంటి మచ్చలు కనబడుతాయి. ఈ తెగులు నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లేదా కార్బండైజిమ్ 1 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ఎండుతెగులు :** ఇది పంట మార్పిడి చేయని చోట్ల ఎక్కువగా వస్తుంది. విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలి.

**కోతలు మరియు అనంతర సాంకేతిక పరిజ్ఞానం :** ఈ పంట 140-160 రోజుల్లో కోతకు వస్తుంది. గింజలు గోధుమ రంగులోకి మారి పరిపక్వ దశకు వచ్చినపుడు గింజరాలకుండా మొక్కలను పీకడం కాని కోయడం కాని చేయాలి. కోసిన మొక్కలను 2-3 రోజులు పొలంలోనే ఎండనిచ్చి, నూర్చు కోవాలి.

**ధనియాలు, మెంతులు, వాము సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా :**

**"ప్రిన్సిపల్ సైంటిస్ట్ (హార్టికల్చర్), ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫారం - 522 034, గుంటూరు."**
**ఫోన్ నెం. - 0863-2524017**

- 0 -